

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 2 పుష్పం : 05-07 20-11-2000

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 24

**VOL: 6 ISSUE: 2**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 140
Each copy Rs. 10

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438

## విచారణ ఆవశ్యకత

జీవునికి స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు గలవు. ఈ మూడు రూపములతో మనకు పరిచయము కలదు. మన అసలు స్వరూపమైన ఆత్మ స్వరూపము గురించి మనకు అనుభవము లేదు. చాలాకాలం నుండి చూడకపోయిన బంధువును గుర్తుపట్టనట్లు, మన ఆత్మ రూపము మనలో ఉన్నప్పటికి దానితో పరిచయము లేని మీదట, దాని ఉనికిని మనము మరచినాము. దానికి కారణము నేను దేహమును అనే సంకల్పం చుట్టూ ఏర్పడిన కృత్రిమ వ్యక్తిత్వంతో మనం తాదాప్యం చెందటం. ఇదే మన ఆత్మ స్వరూపాన్ని కప్పి వేస్తున్నది. నేను దేహమును అనే సంకల్పము ఒక భ్రాంతి మాత్రమే. ఈ సంకల్పము ఎవరికి కలిగినది అను విచారణ చేసినప్పుడు, దేహబుద్ధి క్రమముగా తగ్గి, మన సుఖ స్వరూపము మనకు మన స్వరూపముగా గోచరమగును. నేను దేహమును అనే తలంపు మనకు ప్రతిబంధకము తప్ప, దేహము మన స్వరూపమునకు ప్రతిబంధకము కాదు. అందువలన కేవలము భ్రాంతి అయిన ఈ మొదటి తలంపు గురించి విచారణ చేసినప్పుడు, ఆ తలంపు గురుకృపవలన నశించి, మన ఆత్మ స్వరూపము మనకు వ్యక్తమగును. ఇదే విచారణా ఫలము.

....ఎడిటర్

## ఈ సంచికలో....

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

01-10-2000, చాగల్లు ........ 2
05-10-2000, శృంగవృక్షం ........ 6
28-10-2000, కైకలూరు ........ 11

# కర్తృత్వం లేకుండా పని చేయటమే శరణాగతి

ది. 01-10-2000న చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ మేనేజ్‌మెంటువారి ఆహ్వానం మేరకు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక కేంద్రంలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించినారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధన అనేది సహజంగా ఉండాలి కాని అసహజంగా ఉండకూడదు. అసహజంగా ఉంటే మనం సాధన చేయలేము. శరీరాన్ని చూసేవాడు నిజమైన చూపుగలవాడు కాదు. శరీరంలోపల ఉన్న నశించని వస్తువును ఎవడైతే చూస్తున్నాడో వాడు నిజమైన చూపుగలవాడు. లోపల ఉన్న వస్తువును చూడటం నేర్చుకొంటే శరీరం ఉండటం వలన సంతోషంరాదు, శరీరం పోవటం వలన దుఃఖం రాదు. కొంతమంది మనలను స్తోత్రం చేస్తారు. కొంతమంది విమర్శిస్తారు. స్తోత్రం చేసేవారిలో కూడా లోపల నారాయణుడే మాట్లాడుతున్నాడు, విమర్శించే వారిలోకూడా లోపలనుండి నారాయణుడే మాట్లాడుతున్నాడు అని గుర్తు ఉంటే మనకు హెచ్చు తగ్గులు రావు. రమణ భక్తులు సాధన చేస్తున్నట్లు కనబడటం లేదు, ప్రాణాయామం చేయటం లేదు, ధ్యానం చేస్తున్నట్లు కనబడటం లేదు అని ఒకరు అడుగుతున్నారు. సాధన ఎందుకు? సాధన యొక్క ప్రయోజనం ఏమిటి? లోపల సాధకుడు అనేవాడు ఒకడు ఉన్నప్పుడు సాధన చెయ్యాలి. శరీరం సాధన చెయ్యదు. సాధన చేసేది మనస్సు. ప్రారంభంలో విచారణచేసి సాధకుడిని తీసేసినాసరే, సాధకుడు నిజం అనుకొన్నప్పుడు సాధన చేసి వాడిని తొలగించుకోవాలి. ఏదో మార్గంలో ప్రయాణం చెయ్యవచ్చు. నీవు ఆత్మవు. నీవు ఆత్మగా ఉండగలిగితే సాధనతో పనిలేదు కాని మనకు శరీరాన్ని ఆత్మ అనుకొనే బుద్ధి ఉంది. ఆ బుద్ధిని తొలగించుకోవటానికే నీవు యోగాభ్యాసాలు చేసినా, పూజలు చేసినా, ధ్యానం చేసినా శరీరం పట్ల నీకు ఉన్న ఆత్మబుద్ధిని తొలగించుకోవటానికే. సాధన యొక్క ప్రయోజనం అదే. అది తెలుసుకొని చెయ్యాలి. దానికి వివేకం ఉండాలి. అది ఎలాగ వస్తుంది అంటే సజ్జన సాంగత్యం వలన, మంచి అలవాట్ల వలన వివేకం కలుగుతుంది. ఇది అనిత్యం, ఇది నిత్యం, ఇది అసత్యం, ఇది సత్యం అని నిత్యం పట్ల, సత్యం పట్ల మన బుద్ధిని పెంచుకోవటం వలన లోపల నుండి తెలుసుకోవాలనే కాంక్ష, ముముక్షత్వం వస్తుంది. సజ్జన సాంగత్యం అవసరం అని రోజూ పుస్తకాలలో చదువుచున్నాము కాని దురదృష్టం ఏమిటి అంటే దాని విలువ మనకు తెలియటం లేదు. ఎందుకు తెలియటం లేదు అంటే పూర్వజన్మలనుండి మనకు పుణ్యబలం లేకపోవటం వలన దాని విలువ మనకు తెలియటం లేదు. సాధన చేసి ఎవడినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో వాడు ఉన్నంతసేపు ఈ ప్రపంచం అంతా నిజం క్రింద అనిపిస్తుంది, శరీరం చనిపోయినప్పుడు నేను

చనిపోతున్నాను అనిపిస్తుంది.

విచారణలేని వాడికి డబ్బువలన గర్వం వస్తుంది, పాండిత్యం వలన తర్కం వస్తుంది. ఇద్దరూ పనికిరారు. మన గమ్యాన్ని మర్చిపోయినప్పుడు మనకు గర్వం వస్తుంది. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. పాండిత్యం, ధనం వాటి అంతట అవి చెడ్డవికావు. మనం ఎలా ఉపయోగించుకోవాలో తెలియనప్పుడు మనకు తర్కం వస్తుంది, గర్వం వస్తుంది. ధనం సంపాదించటం కంటే దానిని సద్వినియోగం చేయటం కష్టం. పండితుడు అవ్వటంకంటే ఆ పాండిత్యాన్ని ఇతరులకు అర్ధమయ్యేలాగ చెప్పటం కష్టం. ఇప్పుడు ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో ఆనేను నిజం అనుకున్నంతకాలం లోకం నిజం, చావు నిజం, పుట్టుక నిజం, కర్మానుభవం కూడా నిజమే. ఆ నేను నిజమైతే సాధనలో పనిలేదు. ఆనేను నిజంకాదు కాబట్టి సాధనచేసి దానిని తొలగించుకోమని చెప్పారు. మీరు ఏ మార్గంలో ప్రయాణంచేసినా ఈ దొంగ నేనులోనుండి విడుదల పొందాలి. మీరు ధ్యానం చేస్తున్నారు అని అంటున్నారు. ధ్యానం చేస్తే 1 గంట చేస్తారు మిగతా 23 గంటలు మీరు ఎలా జీవిస్తున్నారు? మీ మనస్సు ఎక్కడ ఉంటోంది? ఏమి చేస్తోంది? మిగిలిన కాలం అంతా దేహమే ఆత్మ అనే బుద్ధి తగ్గేలా జీవిస్తున్నారా? పెరిగేలా జీవిస్తున్నారా? పూజ, జపం, ధ్యానం మనో నిగ్రహం కోసం చేస్తున్నాము. మనకు నడిచే ఓపిక లేనప్పుడు కర్ర అవసరం. నడిచే శక్తి ఉన్నప్పుడు కర్రతో పనిలేదు. ఈ పూజ, జపం, ధ్యానం కర్రలాంటివి. నీకు వచ్చే తలంపులను నియమించుకొనే శక్తి నీకు లేనప్పుడు జపం, ధ్యానం చెయ్యాలి. జీవితంలో మంచి చెడ్డా వస్తాయి, కష్టాలు సుఖాలు వస్తాయి, వాటిని నీ మనస్సు స్వతస్సిద్ధంగా బేలెన్స్ చేసుకోలేనప్పుడు పూజ చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహబుద్ధి పెరగకుండా చూసుకో. అదే సాధన యొక్క లక్ష్యం. ధ్యానం చేస్తూ నేను బాగా ధ్యానం చేస్తున్నాను, రోజుకు 6 గంటలు ధ్యానం చేస్తున్నాను అని ఇలా అనుకొంటూ ఉంటే దేహబుద్ధి పెరిగిపోతుంది.

నేను అనే తలంపు నీ లోపల నుండి వస్తోంది. ఎక్కడ నుండి వస్తోంది? ఆధ్యాత్మిక హృదయంలో నుండి వస్తోంది. ఆధ్యాత్మిక హృదయం నీకు తెలిసినా ఉంది, నీకు తెలియకపోయినా అది ఉంది. ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో ఆ హృదయంలో నుండే నేను అనే తలంపు వస్తోంది. పూజ ద్వారాగాని, ధ్యానం ద్వారాగాని, నిష్కామకర్మ ద్వారాగాని, విచారణ ద్వారాగాని ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో ఆ హృదయంలోనికి నీ మనస్సును పంపగలగాలి. మనకు బిజినెస్‌లో 4 లక్షలు లాభం వస్తుంది అని అనుకొంటాము అనుకోండి అలా రాలేదు అనుకోండి మనకు బాధ కలిగితే మనం ఫెయిల్ అవ్వటం నేర్చుకోలేదని అర్ధం. జీవితంలో మనం పాస్ అవ్వటం నేర్చుకొంటున్నాము గాని

ఫెయిల్ అవ్వటం నేర్చుకోవటం లేదు. ఫెయిల్ అవ్వటం కూడా నేర్చుకోవాలి. ఫెయిల్ అవ్వటం నేర్చుకొంటే దుఃఖం రాదు. నీ మనస్సు ఎక్కడైతే నిలబడుతోందో వాడే నీ ఇష్ట దైవం, ఆ దేవుని ప్రార్థించండి. ఇతరులను అనుకరించవద్దు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో లీనం చెయ్యాలి. అదే నీ గమ్యం. మీకు మూడు అవస్థలు తెలుసు. ఈ మూడు అవస్థలకు ఆధారంగా ఒక అవస్థ ఉంది. అదే మీరు. అది తెలుసుకొంటే తెరమీద బొమ్మలలాగ దాని మీద ఈ అవస్థలు జరుగుతున్నాయి అని మీకు అనుభవంలోనికి వస్తుంది. దేవుని అనుగ్రహం ఎప్పడు వస్తుంది అని అడుగుతున్నాడు. దేవుని అనుగ్రహం దేవుని చేతిలో ఉంది, నీ చేతిలో లేదు. నీ చేతిలో ఉన్న పనిని నీవు సక్రమంగా చెయ్యి. ఆయన చేతిలో ఉన్న పనిని ఆయన మర్చిపోడు. ఆయనకు మరుపులేదు. ఎప్పడు ఇవ్వాలో అప్పడు ఇస్తాడు. మనకంటే అతీతమైన శక్తి ఒకటి ఉంది. దానికి మన తలవంచి పనిచేయాలి అనే బుద్ధి నీకు గావాలి. అప్పడు ఆయన అనుగ్రహం నీకు అందుతుంది. ఎగిరి ఎగిరి పడేవాడికి దేవుని అనుగ్రహం అందదు. ఒదిగి, ఒదిగి ఉన్నవాడికి దేవుని అనుగ్రహం అందుతుంది. మంచిగా ఉండాలి అని అనుకొంటున్నాము అని చెపుతారు. దైనందిన జీవితంలో మంచిగా జీవించకుండా మంచిగా ఎలా ఉండగలరు. ద్వైత ప్రపంచం అంతా కూడా దొంగనేను కల్పితమేగాని అది పారమార్థిక సత్యం కాదు. ద్వైతం కల్పించేది దొంగనేను. ఈ దొంగనేను ఎంత నిజమో ద్వైతం కూడా అంతే నిజం.

మానవుడు సంపాదించిన ధనాన్ని జ్ఞానానికి ఉపయోగించడు, భోగం అనుభవించటానికి ఉపయోగిస్తాడు. నీవు అనుభవించే ప్రతీభోగంలోను దుఃఖ బీజాలు, అశాంతి బీజాలు ఉన్నాయి అని నీవు మర్చిపోతున్నావు. పూర్తిగా శరణాగతి అయిపోయాను తరువాత నా మనస్సు ఎలా ఉంటుంది అని అడుగుతున్నాడు. శరణాగతి పొందిన మనస్సైనా ఈ ప్రశ్నలు అడిగేది అంటున్నారు భగవాన్. శరణాగతి పూర్తి అయిన తరువాత ఎలా ఉంటాము అని ఇప్పటినుండి ఊహించకు. ఊహించటానికి అది నీ ఊహకు అందేది కాదు, నీ తలంపుకు అందేదికాదు, నీ మాటకు అందేది కాదు. అది నీ అనుభవానికి అందుతుంది. నీ లోపల ఉన్న సద్వస్తువు నీ మాటకు అందదు, నీ తలంపుకు అందదు, నీ అనుభవానికి అందుతుంది. దేహమే నేను అనుకొన్నంతకాలం కోరికలు ఆగమన్నా ఆగవు. కోరికలు కోరేవాడు లోపల ఉంటే కోరికలు ఎలా ఆగుతాయి, వాడిని విచారణ చెయ్యి. ఆత్మ తప్పించి బ్రహ్మం తప్పించి ఈ లోకంలో ఏమీ లేదు. చాలా ఉన్నట్లు మనకు అనిపిస్తుంది అది నీ మనోకల్పితం. నీవు మంచిది అనుకొన్నది ఇంకొకడు చెడ్డది అనుకోవచ్చు. ఇంకొకడు చెడ్డ అనుకొన్నది నీకు మంచి అనిపించవచ్చు. ఇది అంతా మనో కల్పితమే. ఆత్మ తప్పించి అన్నీ నీ మనస్సు యొక్క కల్పితాలే. భగవంతుడు ఉన్నాడా

అని భగవాన్‌ను అడిగితే ఉన్నవాడు వాడు ఒక్కడే అని చెప్పేవారు. అంటేవాడు తప్పించి మిగతాది ఏమీ లేదు అని చెప్పకుండా చెప్పటం.

తలంపులు లేకుండా ఉండలేకపోతున్నాము, వీటిని దాటటం ఎలాగ అని అడుగుతున్నారు. భగవంతుని ప్రార్థించకుండా ఈ తలంపులనుండి బయటకు రాలేవు. భగవంతుని ప్రార్థిస్తున్నాను అయినా ఈ తలంపులనుండి బయటకు రాలేకపోతున్నాను అంటున్నాడు. భగవంతుడు ఉన్నాడు అని నీకు పూర్తిగా నమ్మకం ఉందా అని భగవాన్ అడుగుతున్నారు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం నీకు ఉంటే తప్పనిసరిగా తలంపులనుండి విడుదల పొందుతావు, రాగద్వేషముల నుండి విడుదల పొందుతావు. రాగ ద్వేషములు పెట్టుకొనే కొలది మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు బాహ్యముఖానికి వచ్చేకొలది విషయ చింతన పెరుగుతుంది. విషయాలను చింతించేకొలది జీవలక్షణాలు పెరుగుతాయి. మనం ఏదో ఒకటి చింతించకుండా ఉండలేము. విషయాలను నిరంతరం చింతించే కంటే భగవంతుని నిరంతరం చింతిస్తే నీకు తెలియకుండానే నీ జీవితంలో అనేక మహిమలు జరుగుతాయి. నీకు ఇష్టం లేనివి జీవితంలో జరిగినా నీకు చిరాకు రాకూడదు. నీకు చిరాకు వస్తే ఈశ్వర సంకల్పం మీద విశ్వాసం లేదని అర్థం. తత్వం అర్థం అయ్యేకొలది మనం గడ్డిపరకలతో సమానమని మనకు తెలుస్తుంది. మన అహంభావన కంటే మన దొడ్డిలో ఉన్న పెంట మెరుగు. ఆ పెంటను పొలంలో వేస్తే నాలుగు బస్తాలు ఎక్కువ పండుతుంది. కాని అహంభావన వలన మనకు వచ్చేది ఏమీ లేదు. మన అహంభావన వలన మనమే ఈ పని చేసేసాము అని మనకు అనిపిస్తుంది. పని అయితే సంతోషిస్తాము అవ్వకపోతే ఏడుస్తూ కూర్చొంటాము. అయినా, అవ్వకపోయినా ఈశ్వర సంకల్పమే అని గ్రహించినవాడు బుద్ధిమంతుడు. నేను అనే తలంపు లేకుండా ఎవడైతే పని చేస్తున్నాడో వాడు బుద్ధిమంతుడు.

నీకు వచ్చే కష్టములు భగవంతునికి తెలియకుండా రావటం లేదు.

వాటిని నీవు ఇష్టంతో అనుభవిస్తే ప్రారబ్ధం నశిస్తుంది.

పునర్జన్మ హేతువులు ఉదయించవు.

భగవదనుభవం కలుగుతుంది.

# వ్యక్తిభావనను ఎవడైతే త్యాగం చేస్తాడో వాడు జ్ఞాని అవుతాడు

దేవీ నవరాత్రులు సందర్భంగా ది. 05-10-2000న శృంగవృక్షం పార్వతీదేవి అమ్మవారి ఆలయంలో కమిటీ వారు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించినారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మంచి, చెడు బయటేకాదు మనలోకూడా ఉన్నాయి. చెడును నిర్మూలించి మనం మంచిలో ఉండగలిగితే, మంచిని చూడగలిగితే, మంచిగా జీవించగలిగితే అది మన జీవితంలో విజయదశమి. మంచి లేకపోతే జ్ఞానం కలుగదు. మన హృదయ మందిరంలో మంచితనం, జ్ఞానం కూర్చొంటే అదే విజయదశమి. మంచితనం ఉన్నవాడు మాత్రమే ప్రేమించగలడు. తెలివితేటలు మన కళ్ళకు కనబడతాయి, ప్రేమ మన కంటికి కనబడదు. ఎదుటి మనిషిలో ఉన్న తెలివిని తొందరగా గుర్తించగలము కాని మంచితనం, ఆప్యాయత ప్రేమను గుర్తించటం కష్టం. ప్రాక్టికల్ లైఫ్‌లో ఎంతో అనుభవం ఉంటేగాని వాటిని గుర్తించటం కష్టం. మన హృదయంలో అజ్ఞానం బదులు జ్ఞానం, చెడు బదులు మంచి కూర్చొంటే దేవుడు ఎంతో దూరంలో ఉన్నాడు అనుకొన్నాను కాని ఇంత సమీపంలో ఉన్నాడు అని మనకు అనిపిస్తుంది. మనలో పవిత్రత పెరిగితే, మంచితనం పెరిగితే దేవుడు మనకు అత్యంత సమీపంలో ఉన్నాడు అని మనకు అనిపిస్తుంది. లోపల మంచితనం ఉంటే మాటలో రీజన్ ఉంటుంది, న్యాయం ఉంటుంది. జ్ఞానం పొందటానికి మంచితనం పునాది వంటిది. అందుచేత మనలోని చెడ్డను తీసుకొంటూ మంచితనం పెంచుకుంటూ రావాలి. అనేక జన్మల కృషి వలన జీవుడు పరమపవిత్రుడు అవుతాడు అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఆ పరమ పవిత్రుడి హృదయంలోనే ఈశ్వరుడు ప్రతిబింబిస్తాడు. నేను ఒక వ్యక్తిని అనుకొన్నంతకాలం కోరికలు వస్తూ ఉంటాయి, దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. వ్యక్తి భావనను ఎవడైతే త్యాగం చేస్తాడోవాడు జ్ఞాని అవుతాడు. వ్యక్తి భావన త్యాగం చేసిన వాడి హృదయంనిండా శాంతి ఉంటుంది, జ్ఞానం ఉంటుంది.

నీ శరీరం బంధం కాదు. శరీరంతో తాదాప్యం పొందే బుద్ధి బంధం. నీ బుద్ధి శరీరంతో తాదాప్యం వదిలేస్తే ముక్తి. ఈ బంధం గురించి, ముక్తి గురించి ఆలోచించేది నీ బుద్ధి. లోపల ఉన్న చైతన్యానికి బంధం లేదు, ముక్తి లేదు. నీవు బ్రహ్మంలోనే ఉన్నావు. బ్రహ్మంకు కాలం లేదు. బ్రహ్మం కాలానికి అతీతం. గాఢనిద్రలో కాలం గురించి నీకు తెలియదు ఎందుచేతనంటే గాఢనిద్రలో నీవు బ్రహ్మంలో ఉన్నావు. గాఢనిద్రలో నీకు భవిష్యత్ గురించి కూడా ఆలోచన ఉండదు. జాగ్రదవస్థలో కూడా ఆ బ్రహ్మమును గుర్తించి, దానిని గ్రహించి, ఆ బ్రహ్మంలో నీవు ఉండగలిగితే నీచేతులు ఎవరికి

చూపించనక్కరలేదు, భవిష్యత్ గురించి నీ మనస్సు ఆలోచించనే ఆలోచించదు. చేతులు చూపించుకొనే వారు భవిష్యత్ గురించే కదా. వర్తమానకాలం తెలియని వాడికి భవిష్యత్ కాలం ఏమి తెలుస్తుంది. నువ్వు బ్రహ్మంలోనే ఉన్నావు. అది నీకు తెలియటం లేదు. అది తెలుసుకోవటం మానివేసి దారిని పోయేవారికి అందరికి చేతులు చూపించటం. నీవు బ్రహ్మంలో ఉన్నావు అని గ్రహింపు నీకు లేనప్పుడు నా భవిష్యత్ ఎలా ఉంటుంది అనుకొంటావు. భవిష్యత్ ఎవరికి అహంకారానికి. బ్రహ్మం అన్నింటికి అతీతం. దానికి భూత, భవిష్యత్‌లు ఉండవు. ఈ గొడవలు అన్నీ సృష్టించేది మనస్సు. బేధం కల్పించేది మనస్సు. మనోకల్పితం అంతా నశించేవరకూ ఆత్మజ్ఞానం కలుగదు, పరతత్వం తెలియదు.

మంచి పనిచేయాలని సంకల్పం మనకు ఎప్పుడైనా వస్తూ ఉంటుంది. కాని మనస్సు చేయనివ్వదు. చెయ్యకపోయినా మనస్సు అలాపడి ఉంటే పరవాలేదు, అలాపడి ఉండదు. నేను చేద్దామనుకొన్నాను ఎవరో అడ్డు వచ్చారు చేయలేదు అంటుంది. నేనే అడ్డు వచ్చాను అని చెప్పదు. ఎవరో అడ్డు వచ్చారు అని చెపుతుంది. మాయ అంటే ఇదే. ఎవరిలోనైనా మంచి గుణాలు ఉంటే, సూక్ష్మబుద్ధి ఉంటే వారు ఎన్ని జన్మలు కష్టపడి అవి సంపాదించుకొన్నారో అని వాటిని చూసి సంతోషించటం మొదలుపెడితే సంతోషించవద్దు అని మనస్సు చెపుతుంది. సంతోషిస్తే మనకు వచ్చే నష్టం ఏమిటి? ఎవరిలోనైనా మంచిగుణాలు ఉంటే మనస్సు వాటిని చూడనివ్వదు. ఆ మనస్సే నేను అని జన్మజన్మలు మోసుకొని తిరుగుచున్నావు. పెంట మీద కూర్చొని పెంట వాసన వస్తోంది అనుకొంటే లాభం ఏమిటి? ఎన్ని జన్మలు ఇలా పెంట మీద కూర్చొన్నా వాసన వస్తూనే ఉంటుంది. పెంటమీద కూర్చోవటం పొరపాటు అనుకోవటం లేదు పెంటవాసన వస్తోంది అనుకొంటాము. పెంటమీద కూర్చొన్నప్పుడు పెంటవాసన రాకుండా ఎలా ఉంటుంది. అలాగే నీ మనస్సుచుట్టూ తిరుగుచున్నప్పుడు అలాంటి పెంటవాసనలే వస్తాయి. మనస్సును త్యాగం చెయ్యగలగాలి. ఎదుటి వ్యక్తిలో ఉన్న మంచి గుణాలను నీ మనస్సు గుర్తించనివ్వదు. ఎదుటి వ్యక్తిలో ఉన్న మంచిని గుర్తించలేనప్పుడు నీకు జ్ఞానమా? మందులు మింగుతున్నారు అనుకోండి, రోగం తగ్గాలి. రోజూ మందులు మింగుతాము రోగం తగ్గకపోయినా ఫరవాలేదు అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? పూజవలన, జపం వలన, ధ్యానం వలన మనస్సు అణగాలి, మనస్సుకు నిగ్రహం రావాలి, అవిరావు అనుకోండి దేనికోసం ఇవి అన్నీ చేయటం. రోజూ ధ్యానం చేస్తున్నాము మా మనస్సు అణగలేదు అంటే ధ్యానం యొక్క ప్రయోజనం ఏమిటి? నీవు చేసే పూజ, జపం, ధ్యానం వలన మనస్సు అణగాలి. అణగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అంతేగాని గొప్పలకోసం చేస్తే వాడికి మరణ సమయంలో భగవంతుని స్మరణరానే రాదు.

బజారులో ఉన్న వస్తువుకు రేటు ఎంత ఉందో అది ఇవ్వకపోతే ఆ వస్తువు నీకు రాదు. అలాగే మనస్సును నిలపలేకపోతే మనోమూలంలో ఉన్న సద్వస్తువు నీకు తెలియదు. ఆమూల్యం చెల్లించవలసిందే. కష్టపడి అహంభావనను తొలగించుకొని కొద్దిగా శేషం ఉండిపోయినా నీకు ఆత్మానుభవం కలుగదు. వాసనలు అన్నీ తొలగించుకొని చివరకు ఒక్కవాసన మిగిలి ఉన్నా ఆ ఒక్క వాసన మరల అనేక జన్మలకు కారణం అవ్వవచ్చు, అందుచేత ఒడ్డుకు వాచ్చాక వచ్చాము అనుకోవాలిగాని ఈలోపుగా మనస్సును నమ్మటానికి వీలులేదు. మనం ఎలా ప్రవర్తించినా ఫరవాలేదు భగవంతుడు చూడటంలేదు అని అనుకోవద్దు. భగవంతుడు చూస్తున్నాడు. నిన్ను బహూకరించటానికి గాని, శిక్షించటానికిగాని కొద్ది టైము పట్టవచ్చు. ఆఫలం ఇచ్చేటప్పుడు ఎప్పుడు ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అని ఆయన నిర్ణయిస్తాడు, నిర్ణయం నిర్ణయమే. శిక్షించాలా, బహూకరించాలా అని ఆయన నిర్ణయిస్తాడు. రేపే శిక్ష రాలేదు అని ఇంక శిక్షరాదు అని అనుకోవద్దు. నీకు లక్ష రూపాయలు చెక్ ఇచ్చి నీవు బ్రతికి ఉన్నంతకాలం ఇది మారదు అంటే ఆ చెక్ వలన ఉపయోగం ఏముంది. అలాగే వస్తువు మన హృదయంలోనే ఉంది, ఉంది అనుకోవటం వలన ఏమీ లాభం లేదు. దానిగురించి మనకు తెలియటం లేదు, దాని తాలుక ఆనందం, శాంతి మనకు అందటం లేదు. చాలామంది భూతకాలాన్ని తలపెట్టుకుంటూ ఉంటారు. ఆ చింతే బెంగగా వస్తుంది. అలాచేస్తే బాగుండును ఇలా చేయటం వలన ఈ చిక్కు వచ్చింది అనుకొంటారు. జీవుడు అనుకొన్నట్లుగా జరిగిపోతే ఇంక భగవంతుడు ఎందుకు. ఈశ్వరుని చేతిలో పనిముట్టుగా ఉన్నావన్న సంగతి నీకు తెలియటం లేదు. ఈ తిప్పలు అన్నీ ఎందుకు వస్తున్నాయి అంటే భగవంతునికంటే నీవు వేరుగా ఉన్నావు అనుకోవటం వలన ఈ తిప్పలు వచ్చాయి. వేరు బుద్ధి ఎప్పుడైతే వచ్చిందో అక్కడ నుండి జనన మరణ ప్రవాహం ప్రారంభమవుతుంది.

నీకు పుట్టుకల మీద, చావుల మీద సరదా ఉన్నప్పుడు నా గొడవ నీకెందుకు, నేను నీకు జ్ఞాపకం వస్తానా, నేను ఏదైనా మాట చెప్పినా నీవు వింటావా అని భగవంతుడు చెపుతున్నాడు. మనం భూతకాలంలో బ్రతుకుచున్నాము. తెర అవతల వస్తువు మనకు ఎలా కనబడదో అలాగ భూతకాలాన్ని మర్చిపోవాలి. అప్పుడు వర్తమాన కాలంలో జీవించటం నేర్చుకొంటాము. నీవు రోజూ భగవంతుని ప్రార్థిస్తున్నావుగాని భగవంతుని మీద సజీవమైన విశ్వాసం నీకు లేదు. లోకం ఉందని, దేహం ఉందని, కష్టసుఖాలు ఉన్నాయని నీకు ఎంతనమ్మకం ఉందో అలాగ నారాయణుడి మీద నీకు సజీవమైన విశ్వాసం ఉంటే నీలో ఉన్న లోపాలనుండి, బలహీనతలనుండి ఎప్పుడు ఎలా తప్పించాలో ఆయనే తప్పిస్తాడు. నీమీద నాకు భక్తి ఉంది, నీవు నాకు సహాయం చెయ్యాలి అని భగవంతుడిని అడుగుతున్నాను అని ఒకరు భగవాన్‌తో చెపుతున్నారు. నీవు నాకు

సహాయం చెయ్యి అని నిజమైన భక్తుడు భగవంతుడిని అడగడు. సహాయం చేయటం ఆయన చేతికి వదిలిపెడతాడు. నీవు నిజమైన భక్తుడివికాదు అని నీ మాటలోనే తెలుస్తోంది. నీ భక్తి నిజమైతే నీకు సహాయంచేసినా, సహాయం చేయకపోయినా ఒకలాగే ఉంటావు. ఒకోసారి ఆయన నీ కోరిక నెరవేరుస్తాడు, ఒకోసారి నెరవేర్చడు. కోరిక నెరవేర్చినప్పుడు ఎలా ఉంటున్నావో, కోరిక నెరవేర్చనప్పుడు ఎలా ఉంటున్నావో భగవంతుడు చూస్తాడు. అప్పుడు నీవు సమానంగా ఉంటున్నావు అనుకో ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు వాడు దేవుడు. నీ భక్తి నిజమైతే, నీ విశ్వాసం నిజమైతే భగవంతుని సంకల్పానికి బద్ధుడవై ఉండాలి. కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా మనబుద్ధి సమానంగా ఉంటేవాడు యోగితో సమానము. నీకు కష్టం వచ్చింది అనుకో కంగారు పడకు. ఈ కష్టం భవిష్యత్‌లో ఇంకో మంచికి దారి తీయవచ్చు. ఈ కష్టాన్ని నీవు సహించగలిగితే ఆ మంచిని నీవు పొందవచ్చు. నీకు కొంచెం సహనం ఉంటే, వెయిట్‌చేసే శక్తి నీకు ఉంటే నీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. జీవుడు తన ఇష్టాన్ని ప్రక్కన పెట్టి దేవుడికి ఏది ఇష్టమో ఆ ఇష్టాన్ని జీవుడు సొంతం చేసుకోగలిగితే వాడు అక్కరలేదు అన్నా వాడికి మోక్షం వస్తుంది. మనం నిజమైన భక్తులమయితే భయం ఉండదు, కాదు కాబట్టి భయం వస్తోంది. భక్తుడు ఇతరులను పీడించడు, ఇతరులు ఎవరైనా పీడిస్తే వాడు పీడింపబడడు. భక్తుడు ఇతరులను భయపెట్టడు, ఇతరులు వాడిని భయపెట్టినా వాడు భయపడడు. వాడు నిజమైన భక్తుడు. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని భగవాన్‌తో చెపితే వారిగురించి మర్చిపోతే ఏమీలేదు అన్నారు భగవాన్. ఎవరైతే నిన్ను తిడుతున్నారో వారి గురించి మర్చిపో అన్నారు భగవాన్. ఈశ్వరుని మీద భారం వేసినవాడికి ఏ చింతలు ఉండవు. నీ బెంగలు, చింతలు ఆయనకు విడిచిపెట్టు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు నీ భారాన్ని ఆయన మోయగలడు. ఆయన శక్తి మీదనీకు నమ్మకం ఉంటే నీవు నిజమైన భక్తుడివి.

నీ మూలానికి నీవు శరణాగతి చెందు. నీ మూలాన్ని నీవు చూడలేకపోతున్నావు కాబట్టి దానికి దేవతారూపం కల్పించారు. అదే విష్ణువు, అదే శివుడు. అది తెలియక విష్ణువు కంటే శివుడు గొప్పవాడు, శివుడికంటే విష్ణువు గొప్పవాడు అని తిరుగుచున్నాము ప్రజలలో మూర్ఖత్వాన్ని పెంచటానికి. మతం పేరుమీద మూర్ఖత్వం పెంచుకోకూడదు. మతం పేరు చెప్పి అజ్ఞానం పెంచుకోకూడదు. మనందరం పెంచుకోవలసినది కేవలం హిందూమతాన్ని కాదు, జ్ఞానమతాన్ని పెంచుకోవాలి. మత పిచ్చి కాదు మనకు కావలసింది, జ్ఞానంపట్ల ఆకాంక్ష ఉండాలి. నీ శరణాగతి పూర్ణమయ్యే వరకు నీకు ఎంత సంపద ఉన్నా, ఎంత అధికారం ఉన్నా, ఎంత బలం ఉన్నా నీకు శాంతి దొరకదు. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతునికి ఎక్కువ తెలుసు. అట్టి భగవంతునికి శరణాగతి చెందితే మనకు వచ్చే నష్టం ఏమీలేదు అంతా లాభమే. నీవు బ్రహ్మం. బ్రహ్మంకు భిన్నంగా ఏ

వస్తువు మీద నీకు అనురక్తి ఉండకూడదు. అన్యచింతనరాకూడదు. నీవు ఎవరిగా ఉన్నావో దానినే చింతించు. అనవసరమైన గొడవలలోనికి వెళ్ళవద్దు. దేహయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ మిగిలిన కాలాన్ని ఈశ్వరానుభవం పొందటానికి ఉపయోగించుకో, ఇతరుల మీద తీర్పు చెప్పకు. నీ మీద నీవు తీర్పు చెప్పకో. నీ మీద నీవు తీర్పు చెప్పకొంటే నీకు జ్ఞానం కలుగుతుంది, ఇతరుల మీద తీర్పు చెపితే అజ్ఞానం పెరుగుతుంది. ఎవరైనా నిన్ను ప్రేమిస్తున్నారు అనుకో అది ఈశ్వర ప్రసాదం అనుకో. ప్రేమగా చూడటం లేదు అనుకో అది విషం అనుకోవద్దు అది కూడా ఈశ్వర ప్రసాదం అనుకో. కొంతమందికి నిద్ర అంటే బాగా ఇష్టం. నిద్రపో కాని సూర్యుడు ఉదయించేటప్పుడు, సూర్యుడు అస్తమించేటప్పుడు నిద్రలో ఉండకు. సూర్యుడు ఉదయించేటప్పుడు, సూర్యుడు అస్తమించేటప్పుడు నిద్రలో ఉంటే ఈ జన్మలోకాకపోయినా రాబోయే జన్మలో అయినా దరిద్ర దేవత నీకోసం రెడీగా ఉంటుంది అని పెద్దలు చెపుతున్నారు. ఈశ్వరుడు నీకు దర్శనం ఇచ్చినా, దర్శనం ఇవ్వకపోయినా సంతోషంగా ఉండు. నీ కోరిక నెరవేరినా, నెరవేరకపోయినా సంతోషంగా ఉండు అప్పుడు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. ఆయనకు ఇష్టమైనట్లు నీవు చేస్తే అది భక్తి అవుతుంది, నీకు ఇష్టమైనట్లు ఆయనను చేయమంటే అది అహంకారం అవుతుంది అని చెపుతున్నారు.

జ్ఞానం అనేది మనస్సుతో సంపాదించేది కాదు.

మనస్సు అణిగినచోట జ్ఞానం ఉదయిస్తుంది.

మనం చేసేపని అహంభావనను సంతృప్తి పరచేదిగా కాకుండా జ్ఞాన సముపార్జనకు సహాయపడేదిగా ఉండాలి.

## మూలతలంపు మూలం తెలిస్తే అదే మోక్షం, అదే స్వర్గరాజ్యం

రమణ భక్తుల ఆహ్వానం మేరకు ది. 28-10-2000 కైకలూరు టి.టి.డి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సభలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు నేను అనే తలంపు ఉంది. ఆ నేను అనే తలంపు ఎంతకాలం అయితే ఉందో అంతకాలం భగవంతుడికి భక్తుడిగా ఉండటం మంచిది. భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటే, భగవంతుడిపట్ల భక్తి కలిగి ఉంటే ఆనేను అనే తలంపు నెమ్మదిగా పల్చబడి చిరిగిపోతుంది. నేను అనే తలంపే పిశాచం. మన ఇంట్లో పాములున్నా, జెర్రిలు ఉన్నా మనం జడుస్తాము కాని నేనుఅనేతలంపుకు మనం జడవటంలేదు. పాములకంటే, జెర్రెలకంటే, పులుల కంటే నేనుఅనేతలంపు ఎక్కువ విషపూరితమైనది. పాములకంటే నేనుఅనేతలంపు ప్రమాదం. ఆనేను అనే తలంపు నుండి మనం విడుదల పొందాలి. మన దుఃఖానికి పునర్జన్మలకు నేను అనే తలంపే కారణం. చైతన్యం మనలను ఏమీ ఇబ్బంది పెట్టదు. చైతన్యం నుండి వచ్చిన నేను అనే తలంపే మన దుఃఖానికి కారణం అవుతోంది. ఆ నేను అనే తలంపును తొలగించుకోగలిగితే మనకు శాంతి కలుగుతుంది. మనం కట్టుకొన్న ఇల్లు మన శరీరానికి నీడను ఇస్తుంది. మనకు శాంతి కావాలంటే మన హృదయంలో ఉన్న ఇంటికి వెళ్ళాలి. మన హృదయంలో ఉన్న ఇంటిలో శాంతి ఉంది, ఆనందం ఉంది. అక్కడకు పంపటానికే శాస్త్రాలు, గురువులు. మన హృదయంలో ఉన్న ఇంటికి వెళ్ళటానికి వైరాగ్యం ఉండాలి. అంత లోతులలోనికి వెళ్ళటానికి ఈశ్వరుని పాదాలను ఆశ్రయించాలి. కర్త భగవంతుడే అని అనుకొంటే మనకు దుఃఖం ఉండదు. కాని కర్త మనం అనుకొంటున్నాము. అందువలన మనకు దుఃఖం వస్తోంది. కర్త భగవంతుడే అని మనం రోజూ చదువుతున్నాము కాని అది మనస్సుకు పట్టటం లేదు. కర్త భగవంతుడే అని నీకు అర్థమయినప్పుడు ఆ భావన స్థిరపడినప్పుడు నిప్పు మీద నీరు పోస్తే ఎలా చల్లారిపోతుందో అలాగ నీకు ఎంత దుఃఖం ఉన్నా వెంటనే చల్లారిపోతుంది.

ఈ శరీరాలు అన్నీ బొమ్మలే, నీడలే. ఈ బొమ్మలు మనం చెప్పినట్లు ఆడవు. ఈ బొమ్మలను ఆడించేవాడు ఒకడు ఉన్నాడు. వాడు ఎలా ఆడమంటే అలా ఆడతాయి. ఇంకో నిమిషం తర్వాత ఏమి జరుగుతుందో మనకు తెలియదు. ఈశ్వరాజ్ఞను బట్టి ప్రతీది జరుగుతుంది. మీరు యోగాభ్యాసాలు చేయవచ్చు, అధ్యయనాలు చేయవచ్చు, కాని ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం నీకు ఉంటే పునర్జన్మలు నీకు రావు. మనం చెడ్డను నమ్మినట్లు మంచిని నమ్మము. దానికి కారణం మన మనస్సులో ఉన్న దోషం. ప్రయత్నం చెయ్యండి, ప్రయత్నం చెయ్యండి మన ప్రయత్నం

వలన ఏమీ జరుగదు అంతా ఈశ్వరాజ్ఞనుబట్టి నడుస్తోంది అని మీకు అర్థమయ్యే వరకూ మీరు ప్రయత్నం చేయకుండా ఉండలేరు కాబట్టి ప్రయత్నం చేయమని చెప్పారు. సాధన చెయ్యగా చెయ్యగా తెలుస్తుంది మన వలన ఏమీ అవ్వదు అంతా ఈశ్వరాజ్ఞ ప్రకారం జరుగుతోంది అని అప్పుడు మనకు అర్థమవుతుంది. ఎవరికైనా దుఃఖం వస్తోంది అనుకోండి వారికి ఏ కారణం వలన దుఃఖం వస్తోంది అని చూసుకొని ఆకారణానికి మనం దూరంగా ఉండాలి. ఇతరుల యొక్క అనుభవాన్ని మన సొంత అనుభవం క్రింద మార్చుకొని ప్రవర్తించేవారు తక్కువ మంది ఉంటారు. వారికి సొంతంగా మొట్టికాయలు పడితేగాని బుద్దిరాదు. ఇతరుల అనుభవాన్ని మన సొంత అనుభవం క్రింద మార్చుకోవటానికి బుద్ది సూక్ష్మత ఉండాలి. భక్తి యొక్క శిఖరానికి వెళితే అక్కడ ఏదో ఉంది అనుకొంటున్నారేమో! అక్కడ శాంతి ఉంది, అక్కడే మోక్షం ఉంది. అయితే మనం కొంతదూరం వెళుతున్నాము ఏదో జ్ఞాపకం వచ్చి మరల వెనక్కి వచ్చేస్తున్నాము. ప్రతీమనిషికి ఏదో ఆకర్షణ ఉంటుంది, ఏదో జ్ఞాపకం వస్తుంది, వెనక్కి వచ్చేస్తున్నాడు. మనం సుఖంకోసం, శాంతి కోసం ఇంద్రియాల మీద, లోకం మీద ఆధారపడి ఉన్నంత కాలం మనకు నిజమైన శాంతి దొరకదు. సర్వ సాధారణంగా మనం సంతోషంకోసం ఇంద్రియాలమీద, లోకం మీద ఆధారపడి ఉంటాము. అలా ఉంటే మనస్సు లోపలకు వెళ్లదు. ఇలా సంతోషం కోసం ఇంద్రియాలమీద, లోకం మీద ఆధారపడి ఉంటే ఆ మనిషికి పునర్జన్మ వచ్చి తీరుతుంది.

డబ్బు ఉంటే బయట ఇల్లు కట్టుకోవచ్చు కాని మన హృదయంలో ఉన్న మన ఇంటికి వెళ్ళాలంటే డబ్బువలన, గౌరవం వలన, తెలివి వలన వెళ్లలేము. దీనికి మన తెలివి సరిపోదు. ఎంతో నిర్మలమైన మనస్సు, పవిత్రమైన మనస్సు, సూక్ష్మమైన మనస్సు ఉన్నవాడుగాని హృదయం యొక్క లోతులలోనికి చేరుకోలేడు. గురువు అనుగ్రహం లేకుండా హృదయంలో ఉన్న ఇంటికి మనం చేరుకోలేము. మనం గుడికి వెళ్ళినపుడు ఏమీ కోరికలు కోరుకోకూడదు. మన కోరికలే మనకు తంటాలు తెచ్చి పెడతాయి. మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. మనకు ఏది మంచిదో మన అహంకారానికి ఏమి తెలుస్తుంది. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుస్తుంది. అందుచేత మనం ఏది అడగకుంటా ఉంటే మనకు ఏది మంచిదో అది ఇస్తాడు. మనం కంగారుపడి అది కావాలి, ఇది కావాలి అంటే అది ఇచ్చేస్తాడు అది మంచిది అవ్వవచ్చు, చెడ్డది అవ్వవచ్చు. మీరు పూజ చేసుకోండి, జపం చేసుకోండి భగవంతుడిని ఏమీ అడుగవద్దు. అడగటం వలన మనకే నష్టం. ఏది ఎప్పుడు ఎక్కడ ఎలా ఇవ్వాలి, నీ జీవితం ఎలా మలుపు తిప్పాలి అనేది భగవంతుడు చూసుకొని నీవు అడగకుండా వుంటే అన్నీ భగవంతుడే ఇస్తాడు. మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు అనే విషయం మనకు జ్ఞాపకం ఉండాలి. అది జ్ఞాపకం ఉంటే మనం అడగటం మానివేస్తాము. అరుణాచలేశ్వరుడు అడిగినవారికి

అడిగినదే ఇస్తాడు, అడగనివారికి అన్నీ ఇస్తాడు అని చెపుతారు. అన్నీ ఇవ్వటమే కాదు మోక్షం కూడా ఇస్తాడు. మన పద్ధతిలో మనం సాధన చేసుకోవాలి, మనం తరించే ఉపాయం చూసుకోవాలి గాని ఎదుటివారు అలా ఉన్నారు మనం కూడా అలా ఉండాలి అని అనుకరణ ఉండకూడదు.

నీవు ఆత్మవే అని మీరు చెపుతున్నారు కదా అయితే నేను ఆత్మగా ఉండాలి కదా, ఆత్మలో స్థిరపడాలి కదా అని భగవాన్‌ను ఒకరు అడుగుతున్నారు. నీవు ఆత్మవే. నీవు ఆత్మగా ఉండలేకపోయినా నీవు ఆత్మవే. నీవు ఏమి చేస్తున్నావు అంటే మేము బ్రాహ్మణులము, మేము చదువుకొన్నాము, మాకు ధనం ఉంది అని ఇలా అనుకొంటున్నావు. డబ్బు ఉన్నవారు అందరూ మాకు డబ్బు ఉంది అనుకొంటారు. వారు డబ్బు కాదు వారు ఆత్మే. చదువుకొన్నవారు అందరూ మేము బాగా చదువుకొన్నాము అనుకొంటారు వారు చదువుకాదు వారు ఆత్మే. దేహ ప్రారబ్ధంలో ఉన్నది వస్తుంది. ఇలా అనుకోవటాలు మానివెయ్యి. నెమ్మదిగా నీ ఇంటికి నీవు వెళ్ళిపోతావు దీనికి మించిన సాధన లేదు. నీవు ఏదైనా మాట్లాడితే నిండు మనస్సుతో, పరిపూర్ణమైన హృదయంతో మాట్లాడాలి కాని కేవలం అన్నీ లౌక్యంగా మాట్లాడకూడదు. అన్నీ లౌక్యంగా మాట్లాడుతూ ఉంటే దీపం చిమ్నీ మసిబారిపోయినట్లు నీ మనస్సు మసిబారిపోతుంది. కొంతమంది ఏ పనిచేసినా నిర్మలంగా చేస్తారు. పెద్దపనికూడా చిన్నపనిగా చేస్తారు. వారు దేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు. నాకు మోక్షం కావాలి అని దేవుని అడగనక్కరలేదు. నీకు అర్హత ఉంటే నీవు మోక్షం గురించి మర్చిపోయినా ఆయన మర్చిపోడు, ఆయన మోక్షం ప్రసాదిస్తాడు. స్మశానంలో నీ శరీరం కాలిపోతుంది గాని నేను అనే తలంపు కాలదు. శరీరం ఉండగానే నేను అనే తలంపు కాలిపోయేలాగ చూసుకోవాలి. అప్పడు పునర్జన్మ ఉండదు. మనం ఆత్మానుభవం సంపాదించాలి ఆ గమ్యం నుండి మనస్సు జారకుండా చూసుకోవాలి. ధనవంతులను చూసి మనం కూడా అలా అవ్వాలి అనుకొంటాము అనుకోండి, ఎవరైనా మంత్రిని చూసి మనం కూడా అలా అవ్వాలి అనుకొంటాము అనుకోండి ఆ గమ్యాన్ని మర్చిపోతాము. ఇదే మాయ. కొంతమంది వారి పనులు చేసుకోవటం మానివేసి ఏదో ఉద్ధరిస్తారు అని ధనవంతులచుట్టూ తిరుగుతూ ఉంటారు. వారు ఉద్ధరించేది లేదు, వీరు బాగుపడేది లేదు. మీ హృదయంలో తప్పించి లోకంలో ఏదో ఉందని మీకు అనిపిస్తూ ఉంటే మనకు అజ్ఞానం ఉన్నట్లు గుర్తు.

మనస్సు శేషం లేకుండా హృదయంలో కరిగిపోవాలి. అది హృదయంలో కరిగిపోతే హృదయంలో ఉన్న నీ స్వరూపమే నీకు వ్యక్తమవుతుంది. నీకు చావులేదు, పుట్టుకలేదు, ఈ జన్మలు అన్నీ స్వప్న మాత్రమే అని అప్పడు నీకు తెలుస్తుంది. మన ప్రవర్తన సహజంగా ఉండదు, మాట సహజంగా ఉండదు. కృత్రిమమైన గౌరవాలు కోరతాము. మనం

హృదయాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించటం లేదు, నేను అనే తలంపును కేంద్రంగా పెట్టుకొని బ్రతుకుచున్నాము అందుచేత అన్నీ వికారంగానే ఉంటాయి. నియమములన్నింటిలోకి ఆహారనియమము ఉత్తమమైనది అని రోజూ చదువుచున్నాము. రోజూ స్నానం చేసినట్లు, భోజనం చేసినట్లు పుస్తకాలలో చదువుతున్నాము. అది ఎంతవరకు మన మనస్సుకు పట్టిందో చూసుకోవటం లేదు. మనస్సుకు పట్టాలి, మనస్సుకు పట్టకపోతే ఏమీ ప్రయోజనం లేదు. మనస్సుకు పట్టటానికే సత్పురుషుల సహవాసం. వారి వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తాయి. మనస్సు నిర్మలమైతే, మనస్సు పవిత్రమైతే తన నిజమైన ఇల్లు ఎక్కడ ఉంది అని చూసుకోవటం మొదలుపెడుతుంది, తన నిజమైన ఇంటికి వెళ్ళేటప్పుడు ఏవైనా ఆటంకాలు వచ్చినా వాటిని గెంటుకొనివెళ్ళే శక్తి కూడా దానికి కలుగుతుంది. మనం విమానంలో కూర్చొన్నా విమానంలో ఎంత సరదాగా ఉన్నా విమానంలో ఎప్పుడూ కూర్చోవాలని మనకు అనిపించదు. మన ఇంటికి ఎప్పుడు వెళ్ళిపోతాము అనిపిస్తుంది. మన ఇంటికి వెళితేనేగాని మనకు సుఖం లేదు. అలాగే మన మనస్సు హృదయంలోనికి వెళితేనేగాని దానికి సుఖం లేదు, శాంతి లేదు. హృదయంలోనికి వెళ్ళటానికి అడ్డువచ్చే ఆటంకాలను తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నప్పుడు గురువు కూడా సహకరిస్తాడు. ఎందుచేతనంటే ఆయన లోపలే ఉన్నాడు.

దేహము నేను అనే భావన ఇప్పడు నీకు ఎలా ఉందో మనస్సు వెళ్ళి హృదయంలో కరగిపోయినప్పుడు ఆకాశంలో మెరుపు మెరిసినట్లు బ్రహ్మమే నేను అని తళుక్కున నీకు స్ఫురిస్తుంది. దేనిమీద కాంక్ష పెట్టుకోవద్దు. వచ్చేది ఆగదు. రానిది రమ్మన్నా రాదు. అది నీదేహప్రారబ్ధాన్ని బట్టి జరిగిపోతుంది. జరిగేది ఈశ్వర సంకల్పం, అనుకొనేది మన సంకల్పం. గంగానది సరాసరి వెళ్ళి సముద్రంలో కలవలేదు. సముద్రంలో కలవటానికి ఎన్ని వంకరలు తిరిగిందో అలాగే తల్లి కడుపులోనుండి వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవరి జీవితం ఒకరకంగా ఉండదు. నష్టం వస్తుంది, లాభం వస్తుంది, అవమానాలు వస్తాయి, బహుమానాలు వస్తాయి. జీవితం ఎన్నో వంకరలు తిరుగుతుంది. కాని మన ధ్యాస, ధ్యానం ఈశ్వరుడి మీద ఉండాలి. జీవితంలో కష్టం వస్తుంది, సుఖం వస్తుంది జీవితం అంటే అదే నువ్వు కర్మ అనుభవించటానికి వచ్చావు. అనుభవించటం ద్వారా కర్మనశిస్తుంది. ఇది అంతా స్వప్న మాత్రమే. కాని ఈశ్వరానుభవం పొందాలి అనే గమ్యం మటుకు మర్చిపోకు. నీ జీవితం ఎన్ని వంకరలు తిరిగినా నీ గమ్యం మటుకు మర్చిపోకు. ఈ జీవితంలో ఏముంది, చావులో ఏముంది, వంద సంవత్సరాలు బ్రతుకుతారు అనుకోండి అందులో ఏముంది. ఈ రోజు చేసిన పనే రేపు చేస్తున్నారు. ఈశ్వరానుభవం పొందటానికి ప్రయత్నం చేయండి. అంతవరకు మాయ కల్పించిన

బొమ్మల నుండి బయటకు రాలేరు. దేహం ఎక్కడ ఉన్నా మనస్సును ఈశ్వరుని యందు లగ్నం చేయటం మర్చిపోవద్దు. బాగు చేయవలసింది మనస్సును అందువలన నీ దేహం ఎక్కడ ఉన్నా మనస్సు ఈశ్వరునియందు లగ్నం అవుతోందో లేదో చూసుకో. ఈశ్వరుని మాటలు నమ్మేటట్లు నీ మనస్సుకు ట్రైనింగ్ ఇయ్యి. ఈశ్వరుని పాదాలు చేరటానికి ఈశ్వరుని వాక్యం నీకు సహకరిస్తుంది, వాక్యం దేవుడై ఉన్నది. సత్సంగాలు కాలక్షేపం కోసంకాదు. నీ చైతన్యస్థాయి పెరగటానికి సత్సంగాలు ఉపయోగపడనప్పుడు అవికూడా అనవసరం. మనస్సు అటుఇటు తిరుగుతోంది అనుకో దేహం ఒక్కచోట ఉన్నా ప్రయోజనం లేదు. మనస్సు యొక్క తిరుగుడు ఆపుచెయ్యి. మనస్సు యొక్క సంచారం ఆపుచేయుటానికే యోగాలు, మంత్రాలు, ప్రాణాయామం. నీకు వాంఛలులేని స్థితి వచ్చినప్పుడు, దేహంలోపల నేను ఉన్నాను నాకు బయట ప్రపంచం ఉంది అనే భావన పోయినప్పుడు, మూల తలంపు నశించినప్పుడు నీకు జీవత్వం పోతుంది, శివత్వం మిగులుతుంది. వాంఛలు ఉన్నవాడికి సైతాను దొరుకుతాడు, వాంఛలు లేని వాడికి శివుడు దొరుకుతాడు. ఎల్లమ్మ, పుల్లమ్మ ఈ నామాలు రూపాల గొడవ నీకు ఎందుకు. అందరిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని చూడటం నేర్చుకో. అప్పుడు నీకు భక్తి కూడా అభివృద్ధి చెందుతుంది.

శరీరం ఉన్నవాడికి రోగం కాని శరీరం లేనివాడికి రోగం ఏమిటి. అలాగే మూల తలంపు ఒకటి వచ్చింది కాబట్టి దానితో పూజలు, జపాలు, ధ్యానాలు అది లేనివాడికి ఏదీ అక్కరలేదు. చైతన్యంలో నుండి ఆ మూలతలంపు ఒక బుడగలాగ లెగిసి వచ్చింది. అక్కడనుండి భూకంపాలు వస్తున్నాయి, వరదలు వస్తున్నాయి. అది చల్లారిపోతే ఏమీ లేదు. ఆ బుడగ పోతే శాంతి సముద్రంలో ఊగిసలాడతావు. అప్పుడు నువ్వు ఉన్నావని నీకు తెలుస్తుంది, శాంతిగా ఉంటావు, ఆనందంగా ఉంటావు. జీవితంలో అంతకంటే నీకు కావలసింది ఏముంది. మీరు ఉన్నారని మీకు తెలుసు. ఆ ఉన్నదానితో మీకు తాదాప్యం లేదు. అందువలన బాహ్యమైన సంఘటనలకు మీ మనస్సు చెదిరిపోతోంది. అంతా భగవంతుడే, అంతా ఆత్మే అది తప్పించి ఏమీ లేదు. ఎటుచూసినా దానినే చూడు అప్పుడు నీకు వికారాలు కలుగవు. ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి నీకే వస్తుందని తెలిస్తే చేయకుండా ఎలా ఉండగలవు. ఈశ్వర సంకల్పమే నెరవేరుగాక అని అటువంటి మనస్తత్వం నీకు వస్తే దానిని శరణాగతి అంటారు. ఇప్పుడు నేను ఉన్నాను, ఆయన ఉన్నాడు అనుకొంటున్నావు. శరణాగతి మార్గంలో నేను పోతుంది, ఆయనే మిగులుతాడు. నీకు నిజమైన శరణాగతి కలిగినప్పుడు ఆ శరణాగతి నీలో ఉన్న అహంకారమును వేరుతో సహా తీసి అవతల పడవేస్తుంది. శరణాగతి మార్గం అట్టిది. అహంకారం ఎప్పుడైతే పోయిందో నీవు నీవులాగ నిలుస్తావు అంటే ఆత్మగా నిలుస్తావు,

శాంతిగా నిలుస్తావు. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా, ఏ గురువును ఆశ్రయించినా, ఏ నదిలో మునిగినా నేను అనే తలంపు నీకూడానే ఉంటుంది. దానిలోనుండి బయటకు రావాలని మర్చిపోకు. నేనులోనుండి విడుదల పొందేవరకు పునర్జన్మలు తప్పవు, అశాంతి తప్పదు. ఈ నేను అనే తలంపును పరిష్కారం చేసుకోవటం మానివేసి ఇంకోరకంగా ఏదో మోక్షం వస్తుందని ప్రయత్నం చేసినా నీకురాదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నేను ఉంటుంది. దీనిని పరిష్కరించుకోవాలి. ఈ జన్మలో దీనిని పరిష్కరించుకోకుండా పారిపోతావు అనుకో ఇంకో జన్మలో అయినా దీనిని పరిష్కారం చేసుకోవాలి. దానిని పరిష్కారం చేసుకొనే వరకు నీకు అమృతానుభవం కలుగదు. అందువలన ఈ జన్మలోనే ఇప్పడే ఇక్కడే ఆ మూలతలంపును పరిష్కారం చేసుకో. దానిని తొలగించుకొంటే దుఃఖంలో నుండి, బాధలనుండి, సమస్త అనర్ధములనుండి ఇప్పడే ఇక్కడే విడిపోతావు. మూలతలంపు మూలం తెలిస్తే అదే మోక్షం, అదే స్వర్గ రాజ్యం, అదే శాంతి. ఇప్పుడు మూలతలంపును పరిష్కారం చేసుకోవు అనుకో చనిపోతే ఇంక మనకు సమస్యలు ఉండవు అనుకోకు. చనిపోయిన తరువాత రాబోయే జన్మలో కూడా సమస్యలు ఉంటాయి. మూల తలంపు మూలం తెలిసేవరకూ ఏదో బాధ, ఏదో వెలితి నిన్ను వెంటాడుతూ ఉంటుంది. మీకు బాహ్యంగా అన్నీ ఉన్నాయి అనుకోండి, ఆత్మజ్ఞానం లేదు అనుకోండి. ఏదో వెలితి లోపల స్పష్టంగా తెలుస్తుంది, పూర్ణత్వం లేదు అని మీకు తెలుస్తుంది. అజ్ఞానం ఉన్నంతసేపు ఏదో సమస్యలు వస్తూనే ఉంటాయి. ముందు అజ్ఞానమును తొలగించుకొనే విధానం చూసుకోండి. ఈ యజ్ఞాలు, యాగాలు, మంత్రాలు, తంత్రాలు లేకుండా కూడా మీకు మోక్షం కలుగుతుంది. ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం ఉంటే భగవంతుడు ఒకడు ఉన్నాడు అనే దృఢమైన నిశ్చయం నీకు కలిగితే మంత్రాలు తంత్రాలతో సంబంధం లేకుండా పునర్జన్మలలోనుండి విడుదల పొందుతావు. నేను ఆత్మను అని చెపుతున్నారు కదా మరి నాకు ఆత్మజ్ఞానం ఎందుకు కలగటం లేదు అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడుగుతున్నారు. నేను ఆత్మను అంటున్నావు అయితే ఆత్మగా ఉండాలి కదా నీవు ఆత్మగా ఉండటం లేదు నేను ప్లీడరును అనుకొంటున్నావు. ఇంక నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ముసలివారు అయిన తరువాత భక్తిగాని ఇప్పటి నుండి నీకు భక్తి ఎందుకు అని మా అత్తగారు అంటున్నారు అని ఒకరు భగవాన్‌తో చెపుతున్నారు. దానికి భగవాన్ ఇప్పటినుండి భక్తి ఎందుకు అని అందా? ఎవరు చెపుత చెపితే చెప్పిందిలే వెళ్ళు అని గట్టిగా అన్నారట. మీ అత్తగారి మాటలలో జ్ఞానం లేదు కదా అజ్ఞానం మాటలు నా దగ్గరకు మోసుకొని రావటం ఎందుకు అని అయ్యి ఉండవచ్చు. చెప్పితే చెప్పిందిలే వెళ్ళు అని ఆమెతో బిగ్గరగా అన్నారట భగవాన్.

**అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచలా**